# కరెంట్ అఫైర్స్

## పారిశ్రామిక విప్లవ కేంద్రంగా భారత్

- ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) భారత్‌ను నాలుగో తరం పారిశ్రామిక విప్లవ కేంద్రంగా ఎంచుకుంది. ఈ కేంద్రాన్ని 2018, అక్టోబరు 11న దిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. ఇలాంటి కేంద్రాలు ఇప్పటికే శాన్‌ఫ్రాన్సిస్కో, టోక్యో, బీజింగ్‌లలో ఉన్నాయి.
- ఈ కేంద్రాన్ని మహారాష్ట్రలో ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం, వ్యాపార సంస్థలను ఒకే తాటిపైకి తీసుకొచ్చి నూతన టెక్నాలజీ విధానాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇది పనిచేయనుంది.
- ఇండస్ట్రీ 4.0గా పిలిచే ఈ విప్లవంలో డ్రోన్లు, కృత్రిమ మేధ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీలను తొలి మూడు ప్రాజెక్టులుగా పరిగణనలోకి తీసుకున్నారు.
- కేంద్రం తరపున నీతి ఆయోగ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా డబ్ల్యూఈఎఫ్ మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. డబ్ల్యూఈఎఫ్ వ్యవస్థాపకుడు క్లౌస్ ష్వాబ్.

## సొలిసిటర్ జనరల్‌గా తుషార్ మెహతా

- భారత సొలిసిటర్ జనరల్‌గా 2018, అక్టోబరు 10న తుషార్ మెహతా నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం అదనపు సొలిసిటర్ జనరల్‌గా ఉన్నారు. 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తుషార్ అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు.
- గుజరాత్‌కు చెందిన తుషార్ మెహతా 2020, జూన్ 30 వరకు లేదా తదుపరి ఆదేశాలు జారీ అయ్యేంతవరకు ఈ పదవిలో కొనసాగుతారు.
- గతేడాది అక్టోబరులో సొలిసిటర్ జనరల్ పదవికి రంజిత్ కుమార్ రాజీనామా చేశారు.
- కేంద్ర ప్రభుత్వానికి ముఖ్య న్యాయ సలహాదారు, దేశంలో అత్యున్నత న్యాయాధికారి అయిన భారత అటార్నీ జనరల్ పదవికి అనుబంధంగా ఉండే ఇతర న్యాయ అధికారుల్లో సొలిసిటర్ జనరల్ ముఖ్యమైనవారు. ఇది రాజ్యాంగ పదవి కాదు. అటార్నీ జనరల్ గురించి వివరించే రాజ్యాంగ ప్రకరణ 76 సొలిసిటర్ జనరల్ గురించి ప్రస్తావించలేదు. అటార్నీ జనరల్ విధుల నిర్వహణలో సొలిసిటర్ జనరల్ సహాయపడతారు.

## అసమానతలను తగ్గించడంలో భారత్ వెనుకంజ

- ప్రజల మధ్య అసమానతలను రూపుమాపడంలో భారత్ తగిన స్థాయిలో కృషి చేయడం లేదంటూ బ్రిటన్‌కు చెందిన ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ పేర్కొంది. ఈ విషయంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు చూపిస్తున్న చిత్తశుద్ధిని తెలియజేస్తూ 157 దేశాలతో రూపొందించిన సూచీలో భారత్ 147వ స్థానంలో నిలిచింది.
- ఈ సూచీలో డెన్మార్క్ అగ్రస్థానంలో ఉంది. ఆసియా దేశాల్లో మెరుగైన స్థానంలో ఉన్న జపాన్ 11వ స్థానంలో నిలిచింది.
- భారత్‌లో కార్మిక హక్కులు సక్రమంగా అమలుకావడం లేదని, పని ప్రదేశాల్లో మహిళలకు సరైన గౌరవం లభించడం లేదని ఆక్స్‌ఫామ్ అభిప్రాయపడింది.

## యూత్ ఒలింపిక్స్‌లో..

- యూత్ ఒలింపిక్స్ క్రీడల చరిత్రలోనే భారత్‌కు తొలి పసిడి పతకం దక్కింది.
- 2018, అక్టోబరు 9న అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో జరిగిన యూత్ ఒలింపిక్స్‌లో మిజోరం రాష్ట్రానికి చెందిన భారత వెయిట్ లిఫ్టర్ జెరెమి లాల్‌రినుంగ 62 కేజీల విభాగంలో స్వర్ణం నెగ్గాడు.
- స్నాచ్‌లో 124 కేజీలు ఎత్తిన లాల్‌రినుంగ క్లీన్ అండ్ జెర్క్‌లో 150 కేజీలు, మొత్తం మీద 274 కేజీలు లిఫ్ట్ చేసి అగ్రస్థానంలో నిలిచాడు.



www.eenadupratibha.net

- యూత్ ఒలింపిక్స్‌లో రెండో స్వర్ణాన్ని మనుబాకర్ నెగ్గింది. ఈమె 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో అక్టోబరు 9న స్వర్ణం నెగ్గింది.

## చంద్రబాబుకు గ్లోబల్ అగ్రికల్చర్ పాలసీ లీడర్‌షిప్ అవార్డు

- ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ వ్యవసాయ విధాన నాయకత్వ పురస్కారం – 2018కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగ అభివృద్ధి, రైతుల ఆదాయం పెంపు, గ్రామీణ ప్రాంతాల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి చేస్తున్న కృషి, ఆయన దూరదృష్టిని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు భారత ఆహార, వ్యవసాయ మండలి వెల్లడించింది. ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ చంద్రబాబును ఈ పురస్కారానికి ఎంపిక చేసింది.

## ఐపీసీసీ 48వ సమావేశం

- 2018, అక్టోబరు 8న ఐరాస అనుబంధ విభాగమైన ఐపీసీసీ (ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ – వాతావరణ మార్పుల అంతర్ ప్రభుత్వ కమిటీ) 48వ సమావేశాన్ని దక్షిణ కొరియాలోని ఇంచియోన్‌లో నిర్వహించారు.
- ఈ సమావేశంలో 'ఐపీసీసీ స్పెషల్ రిపోర్ట్ ఆన్ గ్లోబల్ వార్మింగ్ ఆఫ్ 1.5 డిగ్రీల సెల్సియస్, ఎ సమ్మరీ ఫర్ పాలసీ మేకర్స్' పేరిట నివేదికను విడుదల చేశారు.
- పారిశ్రామికీకరణకు ముందు నాటితో పోలిస్తే ఈ శతాబ్దాంతానికి భూతాపంలో పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పరిమితం చేయాలని, 1.5 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గించుకోవడానికి ప్రయత్నించాలని 2015 నాటి పారిస్ వాతావరణ ఒప్పందం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఉష్ణోగ్రతల్లో పెరుగుదలను ఎంతమేరకు కుదించుకోవడం శ్రేయస్కరమన్న అంశంపై ఐపీసీసీ నిపుణులు దృష్టి సారించారు.
- వేడిగాలుల తీవ్రత ఇలాగే కొనసాగితే 1.5 డిగ్రీల సెల్సియస్ స్థాయిని 2030 నాటికి దాటిపోతామని నివేదిక హెచ్చరించింది. 2030 నాటికి కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను 2010తో పోలిస్తే 45 శాతం మేర తగ్గించాలి. 2050 నాటికి ప్రపంచం మొత్తం కార్బన్ న్యూట్రల్‌గా మారిపోవాలని నివేదిక పేర్కొంది.

## యూఎన్ మానవ హక్కుల సంస్థకు భారత్

- ప్రపంచంలోనే అత్యున్నత మానవ హక్కుల సంస్థ అయిన ఐరాస మానవ హక్కుల మండలికి భారత్ ఎన్నికైంది. 2019, జనవరి 1 నుంచి మూడేళ్లపాటు భారత్ ఈ మండలిలో సభ్య దేశంగా ఉండనుంది.
- ఈ సంస్థలో సభ్యత్వం కోసం 2018, అక్టోబరు 12న జరిగిన ఎన్నికల్లో భారత్‌కు 188 ఓట్లు వచ్చాయి. సభ్యత్వం పొందాలంటే కనీసం 97 ఓట్లు రావాలి.
- ఆసియా పసిఫిక్ ప్రాంతం నుంచి అయిదు దేశాలకు స్థానం ఉండగా, మన దేశంతో పాటు బహ్రెయిన్, బంగ్లాదేశ్, ఫిజీ, ఫిలిప్పీన్స్ ఎన్నికయ్యాయి.
- 2011–14, 2014–17ల్లో కూడా ఈ మండలిలో భారత్ చోటు దక్కించుకుంది. నిబంధనల ప్రకారం వరుసగా మూడు సార్లు ఎన్నికల్లో పోటీ చేయకూడదు. ఈ కారణంతో తాజా ఎన్నికల వరకు భారత్ వేచి ఉంది.

## అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్

- తెలంగాణ సహా అయిదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికల షెడ్యూల్‌ను 2018, అక్టోబరు 6న కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తేదీని డిసెంబరు 7గా నిర్ణయించింది. వామపక్ష తీవ్రవాద ప్రభావం ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు రెండు దశల్లో, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్థాన్, తెలంగాణల్లో ఒకే దశలో ఎన్నికలు జరుగుతాయి.

## ప్రపంచ స్నూకర్ విజేత కీర్తన

- ప్రపంచ స్నూకర్ ఛాంపియన్‌షిప్ అండర్–16 టైటిల్‌ను భారత టీనేజర్ కీర్తనా పాండ్యన్ నెగ్గింది. 2018, అక్టోబరు 7న సెయింట్ పీటర్స్‌బర్గ్ వేదికగా జరిగిన టోర్నీ ఫైనల్లో కీర్తన 3–1 ఫ్రేమ్‌ల తేడాతో బెలారస్‌కు చెందిన అల్బినా లెస్‌చుక్‌పై విజయం సాధించింది. కర్ణాటకకు చెందిన కీర్తనకు ఇదే తొలి అంతర్జాతీయ టైటిల్.

## కొత్తగా అయిదు RAF కేంద్రాలు

- దేశవ్యాప్తంగా కొత్తగా అయిదు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (RAF) కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో దేశవ్యాప్తంగా వీటి సంఖ్య 15కు చేరుకోనుంది.

## అండర్-19 ఆసియా కప్ నెగ్గిన భారత్

- అండర్-19 ఆసియా కప్ విజేతగా భారత్ నిలిచింది. 2018, అక్టోబరు 7న ఢాకాలో జరిగిన ఫైనల్లో 144 పరుగుల భారీ తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది.
- ఫైనల్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ హర్ష్ త్యాగి, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ యశస్వి ప్రసాద్ (ఇద్దరూ భారత్). ఈటోర్నీలో భారత్ కెప్టెన్ సిమ్రన్ సింగ్.
- ఆసియా కప్ అండర్-19 టైటిల్ నెగ్గడం భారత్‌కు ఇది ఆరోసారి. గతంలో 1989, 2003, 2012, 2014, 2016లలో కూడా భారత్ విజేతగా నిలిచింది.

## 2018 నోబెల్ పురస్కార విజేతలు

| రంగం | విజేతలు | పరిశోధన |
|---|---|---|
| వైద్యశాస్త్రం | తసుకు హోంజో (జపాన్)<br>జేమ్స్ పి. అల్లిసన్ (అమెరికా) | క్యాన్సర్ కణాలపై దాడిచేసేలా రోగ నిరోధక వ్యవస్థను క్రియాశీలం చేసేందుకు వీరు పరిశోధన చేపట్టారు. |
| భౌతికశాస్త్రం | 1) ఆర్థర్ ఆష్కిన్ (అమెరికా)<br>2) గెరార్డ్ మౌరో (ఫ్రాన్స్)<br>3) డోనా స్ట్రిక్‌ల్యాండ్ (కెనడా) | నేత్ర చికిత్సకు ఉపకరించే సూక్ష్మ పరికరాల రూపకల్పన దిశగా లేజర్ ఫిజిక్స్‌పై పరిశోధనలు చేశారు. |
| రసాయనశాస్త్రం | 1) జార్జ్ పి.స్మిత్ (అమెరికా)<br>2) ఫ్రాన్సిస్ హెచ్ అర్నాల్డ్ (అమెరికా)<br>3) సర్ గ్రెగరీ వింటర్ (బ్రిటన్) | జీవ పరిణామక్రమ సూత్రాల ఆధారంగా సరికొత్త ఎంజైమ్‌లను అభివృద్ధి చేశారు. |
| శాంతి | నదియా మురాద్ (ఇరాక్)<br>డెనిస్ ముక్వెగె (కాంగో) | ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, అంతర్యుద్ధాలు జరుగుతున్న కల్లోలిత ప్రాంతాల్లో నిస్సహాయ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడటాన్ని, వారిని యుద్ధ సాధనాలుగా వాడుకోవడాన్ని గర్హిస్తూ ఉద్యమించారు. |
| ఆర్థికరంగం | విలియం నార్డ్‌హాస్ (అమెరికా)<br>పాల్ రోమర్ (అమెరికా) | వాతావరణం, సాంకేతిక ఆవిష్కరణలతో ఆర్థికవృద్ధిని అనుసంధానించే విధానాలను రూపొందించారు. |

రచయిత: సీహెచ్. కృష్ణ ప్రసాద్

www.eenadupratibha.net